

5కే రన్‌లో ఓటుహక్కు వినియోగించుకుంటామంటూ విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

## ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

**జోగిపేట, ఆగస్టు19, ప్రభాతవార్త:** పద్దెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవటంతపాటు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు పిలుపునిచ్చారు. గురువారంనాడు ఓటరు అవగాహనలో భాగంగా నిర్వహించిన 5కే రన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని, అందుకని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కాగా అందోలు నుంచి అన్నాసాగర్ వరకు ఐదు కిలోమీటర్ల రన్నింగ్ చేశారు. ఇందులో జోగిపేటలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులతోపాటు తహశీల్దారు అంటోని, డిప్యూటి తహశీల్దారు సాగర్ మధుకర్‌రెడ్డి, నాయబ్ తహశీల్దార్ చంద్రశేఖర్, సిఐ నాగరాజు, మున్సిపల్ కమీషనర్ తిరుపతి, ఎంఇవో క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా మిగిలిన బిసి కమిటీ హాల్



రాంసాగర్‌పల్లిలో అసంపూర్తిగా నిలిచిన బిసి కమిటీ హాల్

**వర్గల్, ఆగస్టు 19 (ప్రభాతవార్త):** వర్గల్ మండలంలోని నెంటూర్ మదిర గ్రామమైన రాంసాగర్‌పల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరుచేసిన నిధులతో చేపట్టిన బిసి కమిటీ హాల్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన కమిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినప్పటికీ స్పందించలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న కమిటీ హాల్ పశువులకు, కుక్కలకు ఆవాసంగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కమిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కోరారు.

## నాచగిరి క్షేత్రంలో పోటెత్తిన భక్తజనం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

**వర్గల్, ఆగస్టు 19 (ప్రభాతవార్త):** వర్గల్ మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామి దేవాలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని శనివారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో స్వామివారికి 18 నిజాభిషేకాలు, 40 సత్యనారాయణ వ్రతాలు, 2 స్వామివారి కళ్యాణాలు జరుపుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓబీసీ నేతల సమావేశానికి హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన ఓబీసీ సీనియర్ నాయకుల సమావేశానికి టీపీసీసీ ఉపాధ్యాక్షులు డాక్టరు పి.సంజీవరెడ్డి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టరు పి.సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీలకు బీసీ డిక్లరేషన్ గురించి వివరించినట్లు ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారుగా 54 శాతం మంది బీసీలే ఉన్నారని రాష్ట్రంలోని పది జిల్లాల్లో ఇప్పటికే బీసీ సమావేశాలు జరిగినట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో బీసీ గర్జన నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నేతలు వెల్లిడించరన్నారు. ఇందుకు వేదికగా షాద్‌నగర్ లో బీసీ గర్జన సభ నిర్వహించి ఈ సభకు మూడు లక్షల మందితో సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సభ వచ్చేనెల 6వ తేది లేదా 9వ తేదిల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ బీసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ బీసీ అధ్యక్షులు సుత్తి శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎస్ఐని సన్మానించిన సంకాపూర్ బీఆర్ఎస్ నాయకులు

**నార్సింగి, ఆగస్టు 19, ప్రభాతవార్త ః**

నార్సింగి మండల పరిధిలోని సంకాపూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు నూతనంగా వచ్చిన ఎస్ఐ మహ్మద్ హైమద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. శనివారం నాడు వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని సన్మానించి మాట్లాడుతూ మండలంలో ఎస్ఐ చేపట్టే కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. అనంతరం ఎస్ఐ హైమద్ మాట్లాడుతూ ప్రజల సహకారం ఉన్నంతవరకు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలోపార్టీ గ్రామ ఉపాధ్యక్షుడు దుర్గారెడ్డి, ఉపసర్పంచ్ అనిల్‌గౌడ్, రైతుబంధు కోఆర్డినేటర్ మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు పద్మ, నర్సింలు, లక్ష్మి, మల్లేశ్, రేఖ, మహేష్‌గౌడ్, లక్ష్మి స్వామి, నాయకులు పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐని శాలువాలతో సన్మానిస్తున్న సంకాపూర్ బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతన్న ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**రాయపోల్, ఆగస్టు19 ప్రభాతవార్త :** రాయపోల్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్ అధ్యక్షతన ఎంపీడీవో మునయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు వారి నివేదికను చదివి వినిపించారు. ఈ సమావేశంలో వడ్డేపల్లి సర్పంచ్ బచ్చు చంద్రశేఖర్, బేగంపేట సర్పంచ్ మద్ద ప్రవీణ్ లు మాట్లాడుతూ.. వడ్డేపల్లి, బేగంపేట గ్రామాలలో వాటర్ ట్యాంకులు శిథిలావస్థలో ఉన్నాయని అధికారులు వెంటనే స్పందించి వాటిని కూలగొట్టి వాటి స్థానంలో కొత్త వాటర్ ట్యాంకులు నిర్మించాలని అధికారులను కోరారు. అనాజిపూర్ గ్రామ సర్పంచ్ శోభ మాట్లాడుతూ..అనాజిపూర్‌లో బీసీ కాలనీలోకి మిషన్ భగీరథ నీళ్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. అంకిరెడ్డిపల్లి సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి మాట్లాడుతూ..అధికారులు వత్తిడి తేవడంతోనే గ్రామంలో క్రీడా ప్రాంగణం కోసం ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టామని కానీ అధికారులు ఖర్చు పెట్టిన డబ్బులలో సగం మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనంతరం రాయపోల్ మండలాన్ని నూతనంగా ఏర్పడే దుబ్బాక డివిజన్‌లో కాకుండా గజ్వేల్ డివిజన్‌లోనే కొనసాగించాలని ప్రజాప్రతినిధులు అందరూ ఏకగ్రీవ తీర్మాణం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జహిర్ మొయినుద్దీన్, ఏపిఎం దుర్గాప్రసాద్, ఏవో నాగరాజు, మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్‌హైమాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాయపోల్ మండలాన్ని గజ్వేల్ డివిజన్‌లోనే కొనసాగించాలి



ఎంపీడివోకు వినతి పత్రం అందజేస్తున్న మండల ప్రజాప్రతినిధులు

**రాయపోల్, ఆగస్టు19 ప్రభాతవార్త :** రాయపోల్ మండలాన్ని నూతనంగా ఏర్పడే దుబ్బాక డివిజన్‌లో కాకుండా యధావిధిగా గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోనే కొనసాగించాలని ఎంపీపీ కల్లూరి అనితశ్రీనివాస్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు వెంకటనర్సింహారెడ్డి లు డిమాండ్ చేశారు. శనివారం రాయపోల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మునయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆనంతరం వారు మాట్లాడుతూ..కొత్తగా దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను స్వాగతిస్తున్నామని కానీ రాయపోల్ మండలం గజ్వేల్‌కు నాలుగు కిలోమిటర్ల దూరంలో ఉన్నందున దుబ్బాకలో కలిపితే 30 కిలోమిటర్లు వెళ్లాల్సి న పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రజలను ఇబ్బందుల పాలు చెయద్దని కోరారు. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ కార్యాలయాలు ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం కొత్త జిల్లాలను, కొత్త డివిజన్, కొత్త మండలాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. రాయపోల్ మండలాన్ని గజ్వేల్ డివిజన్‌లో కొనసాగించాలని వారన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్ హైమాద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మౌనికరాజిరెడ్డి, బచ్చు చంద్రశేఖర్, వెంకట్రాంరెడ్డి, శోభ, బుచ్చమ్మ, మద్ద ప్రవీణ్, స్వామి, ఎంపీటీసీ లక్ష్మియాదగిరి, మండల నాయకులు గణేష్, మల్లేశం, కుమార్, రజినికాంత్ తదితరులు పాల్గొన్నారు

## టార్పాలిన్‌లు పంపిణీ



టార్పాలిన్లను పంపిణీ చేస్తున్న ఎమ్ఎస్ఎస్‌వో సభ్యులు

**చిన్నశంకరంపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండల పరిధి గజగట్లపల్లిలో శనివారం కురుస్తున్న వర్షానికి పూరిగుడిసెలలో నివసిస్తున్న వారికి మైనంపల్లి స్వచ్ఛంధ సంస్థ సభ్యులు టార్పాలిన్లను అందించారు. వారికి గృహలక్ష్మీ పథకం ద్వారా ఇళ్లు మంజూరు కాకపోతే ఇళ్లను నిర్మించి ఇస్తానని మైనంపల్లి స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ రోహిత్ తెలిపినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు సురేష్‌గౌడ్, లింగంరాజు, అస్లాం, మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## 146వ రోజులకు చేరిన రెవెన్యూ డివిజన్ దీక్షలు

**రామాయంపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రామాయంపేట రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 146వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ సుమారు 50 డిగ్రీల మండుటెండలో సైతం రిలే నిరాహార దీక్షలు కోనసాగిస్తున్నామని, ఇప్పటికైన స్థానిక నాయకులు, స్థానిక ఎమ్మెల్యే చోరవ తిసుకోని మెదక్ కలెక్టరెట్ కార్యాలయ ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి చేత రామాయంపేట పట్టణాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తున్నామని ప్రకటన చేయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకుల పాల్గొన్నారు.

## సీఎం భహిరంగ సభను విజయవంతం చేయండి

**రామాయంపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఈ నెల 23న మెదక్ జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరెట్ కార్యాలయ భవనాన్ని, జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించటానికి వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని రామాయంపేట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బండారు మహేందర్‌రెడ్డి కోరారు. లక్ష్మాపూర్, కాట్రియాల, పర్వతాపూర్, దంతేపల్లి, కిషన్ తండా సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, గ్రామ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు మరియు పథకాల గురించి తెలియజేస్తూ ప్రతి ఒక్కరు సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మండలం అధికార ప్రతినిధి చిట్టి మల్లి దేవేందర్‌రెడ్డి, రామాయంపేట మండల యూత్ ఉపాధ్యక్షులు దోమ్మాట శ్రావణ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## జూదగృహంపై దాడి-8 మంది అరెస్టు

**జహీరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** పట్టణంలోని డ్రైవర్ కాలనీలో మైనుద్దీన్ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా జూదం ఆడుతున్న జూదగ్రస్థులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం... మైనుద్దీన్ ఇంట్లో 8 మంది పేకాట ఆడుతున్నట్లు తెలుసుకుని జూదగృహంపై దాడి చేయగా పేకాట రాయుళ్ల నుంచి 4150 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.



## పాపన్నపేటలో ఫోటో గ్రాఫర్‌ల దినోత్సవం

**పాపన్నపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పాపన్నపేటలో శనివారం ఫోటో గ్రాఫర్‌ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జాయిన్ లూయిస్ జన్మదినాన్ని ఫోటో గ్రాఫర్‌ల దినోత్సవంగా జరుపుకుంటూ వస్తున్నామని ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఏడుపాయల కమాన్ దగ్గర లూయిస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నర్సాగౌడ్, శ్రీనివాస్, కోశాధికారి నాగరాజు, మహేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రవీందర్, రాము, రవి, శ్రీకాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్‌రెడ్డి

**జహీరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** డిసిసి ప్రధాన కార్యదర్శిగా నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామానికి చెందిన మల్లికార్జున్‌రెడ్డిని నియమిస్తూ టిపిసిసి అధ్యక్షులు ఏ రేవంత్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మల్లికార్జున్‌రెడ్డి సతీమణి జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న శాసన సభ, పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా నాయకులతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థులు విజయ డంకా మోగించేలా కృషి చేస్తామన్నారు.

## పట్టణంలో 5కే రన్



పట్టణంలో 5కే రన్ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు, నాయకులు

**జహీరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఓటు హక్కు విలువలను తెలియచేసేందుకు శనివారం 5 కే రన్ నిర్వహించారు. పట్టణంలోని ఎంఆర్‌హెచ్ఎస్ పాఠశాల నుంచి జాతీయ రహదారి గుండా అంబేద్కర్ విగ్రహం వరకు రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ వెంకారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఓటు హక్కుతో కలిగే ప్రయోజనాలపై వివరించారు. కార్యక్రమంలో డిఎస్‌పి రఘు, మున్సిపల్ కమీషనర్ జి మల్లారెడ్డి, తహసీల్దార్ ఎస్ రవీందర్, ఎంఈఓ బసవరాజ్, పిఆర్‌టియు సంఘం నాయకులు, టీబేస్ నాయకులు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల బాధ్యులు, విద్యార్థులు, ఆయా శాఖల అధికారులు, పోలీసు అధికారులు, అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అధ్యక్షురాలు ప్రియాంక గుండారెడ్డి

**జహీరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండల సర్వసభ్య సమావేశం శనివారం సాదాసీదాగా ముగిసింది. ఎంపిపి అధ్యక్షురాలు ప్రియాంక గుండారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదకలను సభలో చదివి వినిపించారు. ఈసందర్భంగా ఎంపిపి అధ్యక్షురాలు ప్రియాంక గుండారెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉపాధ్యక్షులు హసీనా బేగం, ఎంపిడిఓ మహేష్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం

### జూనియర్ సివిల్ జడ్జి, న్యాయమూర్తి అనిత



న్యాయ విజ్ఞాన సదస్సులో రైతులకు అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి, న్యాయమూర్తి అనిత తదితరులు

**నర్సాపూర్, ఆగస్టు 19.ప్రభాతవార్త:** ప్రజల అందరికి చట్టాలపై అవగాహన అవసరమని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కే.అనిత పేర్కొన్నారు .శనివారం మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ అధ్వర్యంలోకోర్టు ఆవరణలో రైతులకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈసదస్సులో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి, న్యాయమూర్తి అనిత మాట్లాడుతూ భూ చట్టాలు, పోలీస్ చట్టాలు, ఆడపిల్లలకు ఆస్తిలో సమాన వాటా వంటి ఆంశాలను తెలియ జేస్తు అవగాహన కల్పించారు. అంతేగాక ఈ అవగాహన సదస్సులో పాల్గొన్న మండల తహాశీల్దార్ కమలాద్రి నూతనంగా ప్రవేశ పెట్టిన ధరణిపోర్టల్ ఉపయోగం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈమేరకు జూనియర్ సివిల్ జడ్జి, న్యాయమూర్తి అనిత పిఎల్‌సి కేసులను పర్సు చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, న్యాయవాదులు ఆనంద్‌కుమార్, రాజునాయక్, లీగల్ సర్వీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సేవలు. భేష్

**కల్హేర్, ఆగస్టు 19 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత ఆర్టీసీ సేవలు మెరుగుపడ్డాయని కల్హేర్ జడ్పీటీసీ సభ్యులు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం కల్హేర్ మండల పరిధిలోని బాచేపల్లిలో ఫ్రీ బస్సు పాసుల గురించి రూ.పదివేల రూపాయలు, 200 మంది పేద విద్యార్థులకు ఉచిత బస్ పాసులు అందజేయడం జరిగిం దన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామాలు తిరిగి డిపో మేనేజర్ సిబ్బంది ఉచిత బస్సు పాసులు ఇవ్వడం అభినం దనీ యమన్నారు. అదే విధంగా ఆయా గ్రామాల వద్ద ఉపాధ్యాయులు విద్యార్థుల కోరిక మేరకు రెక్వెస్టు స్టాపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డిపో మేనేజర్ మల్లేష య్య, రైతుబంధు అధ్యక్షులు దుర్గారెడ్డి, పీఏస్సీ చైర్మన్‌సంగారెడ్డి, మా ర్కెటింగ్ సెల్ ఇంఛార్జి పాండు, కిషన్, బాచేపల్లి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగాసిర్గాపూర్‌లో ఫోటో గ్రాఫీ దినోత్సవం

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శనివారం సిర్గాపూర్ మండల పార్టీ అధ్యక్షులు సంజీవరావు ఆధ్వర్యంలో సాయి డిజిటల్ ఫోటో స్టూడియో లో కేక్ కట్ చేసి ఫోటో గ్రాఫర్‌లను శాలువతో ఘనంగా సన్మానించారు.



బండి సంజయ్‌తో మనోహర్‌యాదవ్, మహిపాల్‌యాదవ్

## మనోహర్, మహిపాల్‌లను సన్మానించిన బండి సంజయ్

**గజ్వేల్, ఆగస్టు 19 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో గత కొన్ని రోజుల క్రితం జరిగిన ఘర్షణలో 15 రోజుల పాటు కరీంనగర్ జైలులో ఉండి బెయిల్‌పై వచ్చిన బిజెవైఎం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మఠం మహిపాల్‌యాదవ్‌లను బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ శాలువాలతో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మనోహర్ యాదవ్, మహిపాల్‌యాదవ్‌లు మాట్లాడుతూ ఢిల్లీ నుండి కరీంనగర్‌కు వచ్చిన బండి సంజయ్ తమను కరీంనగర్‌కు పిలిపించుకొని తమతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారని, అనంతరం ధర్మం కోసం కొట్లాడిన తమను అభినందిస్తూ సత్కరించినట్లు తెలిపారు. త్వరలోనే గజ్వేల్ పర్యటనకు రానున్నట్లు బండి సంజయ్ తెలిపారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, బిజెవైఎం గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ మన్నె శేఖర్, బిజెపి నాయకులు మంద వెంకట్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ శంకర్

**మర్కుక్, ఆగస్టు 19 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని రైతులు, ప్రజలు గ్రామాల్లో ఎలాంటి దొంగతనాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని మర్కుక్ ఎస్ఐ శంకర్ సూచించారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు, గౌరారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న పలు గ్రామాల్లో గుర్తుతెలియని దొంగలు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల నుండి కాపర్ కాయిల్స్ (రాగి) దొంగిలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉంటూ తమ గ్రామాల్లో, వ్యవసాయ బావుల వద్ద, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే 100కు కాల్‌చేసి సమాచారం అందించాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో సర్పంచ్‌లు చాటింపు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## రూ.4 లక్షలతో ప్రభుత్వ పాఠశాల విద్యాభివృద్ధికి కృషి



పాఠశాలలో ఇంటరాక్టివ్ పానెల్ బోర్డును ప్రారంభిస్తున్న మధుసూదన్

**మర్కుక్, ఆగస్టు 19 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యాభివృద్ధి కోసం ఎడ్యుకేట్ అండ్ ఎన్‌రిచ్‌మెంట్ ఫౌండేషన్ చైర్మన్ ప్రతిక్‌శీల, సభ్యులు గార్లపాటి మధుసూదన్‌లు అందించిన సహకారం అభినందనీయమని గ్రామ సర్పంచ్ లక్ష్మిరాములుగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణలు అన్నారు. పాఠశాల విద్యార్థుల కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి బోధించుటకు అవసరమైన ఇంటరాక్టీవ్ పానెల్ బోర్డును సుమారు రూ.3 లక్షల వ్యయంతో పాఠశాలకు అందించగా ఫౌండేషన్ ప్రతినిధులు గ్రామ సర్పంచ్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 212 మంది విద్యార్థులకు సుమారు రూ.లక్ష విలువైన స్కూల్ బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, కృష్ణ, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్, మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపి మానిక్‌రెడ్డి వర్ధంతి

### నివాళుల అర్పించిన అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్



మాజీ ఎంపి మానిక్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్

**జోగిపేట, ఆగస్టు19, ప్రభాతవార్త:** మాజీ పార్లమెంటు సభ్యులు పి.మానిక్‌రెడ్డి ఐదవ వర్ధంతి సందర్భంగా శనివారంనాడు డాకూరులోని ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాళలు వేసి ఎమ్మెల్యే చంటి క్రాంతికిరన్ నివాళులు అర్పించారు. ఆయనతోపాటు డిసిఎంఎస్ ఛైర్మెన్ శివకుమార్‌కు మానిక్‌రెడ్డికి నివాళుల అర్పించారు. కాగా బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు జోగిగిపేటలోని జోగినాథ చౌరస్తాలో మానిక్‌రెడ్డి వర్ధంతిని ఘణంగా నిర్వహించారు. వారు మానిక్‌రెడ్డి చిత్రపటానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. మానిక్‌రెడ్డి పార్టీకి పెద్దదిక్కుగా ఉండే వారని ఆయన జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పి.జైపాల్‌రెడ్డి, సినీ హీరో జయంత్‌రెడ్డి, నాయకలు సాయికుమార్, జైపాల్‌నాయక్, అందోలు ఎంపిపి బాలయ్య, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, లింగాగౌడ్, రామాగౌడ్, చాపల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహానికి సహకరించిన వ్యక్తుల రిమాండ్

**చిన్నశంకరంపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:**

చిన్నశంకరంపేట మండలం జంగరాయి తండాకు చెందిన మైనర్ బాలికను అదే తండాకు చెందిన మాలోత్ మోహన్ నాలుగు రోజుల క్రితం వివాహం చేసుకున్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదు చేయగా స్థానిక ఎస్ఐ నారాయణ గౌడ్ విచారణ చేపట్టారు. ఈ మేరకు మాలోత్ మోహన్‌తో పాటు వివాహనికి సహకరించిన మాలోత్ బిక్యా, మాలోత్ శాంతి, మాలోత్ బుజ్జిలను అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి శనివారం తెలిపారు. ఎవరైన బాల్య చేపట్టినా, వారికి సహకరించినా చట్టపరమైన చర్యలు తిసుకుంటామని తెలిపారు.

## ఎస్ఐని సన్మానించిన ముదిరాజ్ సంఘం అధ్యక్షులు

**నాగల్‌గిద్ద, ఆగస్టు 19, ప్రభాతవార్త:** నాగల్‌గిద్ద పోలీసు ఠాణాలో ఇటీవల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సిద్దిరాములును శనివారం మండలంలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షులు అవుటి నర్సింలు తన అనుచరులతో కలిసి ఘనంగా సన్మానించారు. మండలంలో శాంతి భద్రతలకు తమ వంతు సహకారం అందిస్తామని నర్సింలు ఎస్ఐకి హామి చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి చందు, నాయకులు జ్ఞానేశ్వర్, ప్రవీణ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## ఫొటో గ్రాఫర్‌లను సన్మానించిన పిఎం రాజు


ఫోటో గ్రాఫర్‌లను సన్మానిస్తున్న పులిమామిడి రాజు

**సదాశివపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ప్రపంచ ఫోటో గ్రాఫర్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో శనివారం పిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఫోటో గ్రాఫర్‌లను పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నేత, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ కలగర్భంలో కలిసిపోయే చరిత్రను శాశ్వతంగా, సజీవంగా నిలపేది ఫోటోలే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్‌లు, పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**మనూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండలంలోని ఎల్గోయి గ్రామానికి చెందిన వైజ్యనాథ్‌రావుకు ఆరోగ్య చికిత్స కోసం ఆదివారం నారాయణఖేడ్ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి 2లక్షల 50వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందచేశారు. గ్రామానికి చెందిన కిషన్‌రావు తనయుడు వైజ్యనాథ్‌రావు అనారోగ్యంతో అవస్థలు పడు తున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే సిఎంఆర్ఎఫ్ ద్వార ఆదుకున్నారు. ఎల్ఓసిని అందచేసిన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి కిషన్‌రావు, వైజ్యనాథ్‌రావులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కర్ర రమేష్, ఔహాన్‌లు ఉన్నారు.

## వర్క్ షీట్‌పై తల్లిదండ్రులకు అవగాహన

**మునిపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త:** విద్యార్థులకు ప్రభుత్వం అందచేసిన వర్క్ షీట్‌లపై అవగాహన కల్పించారు. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల (పేరెంట్స్ మీటింగ్) సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ ఖరొద్దీన్ మాట్లాడుతూ 1 నుంచి 5వ తరగతిలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులందరికి ప్రభుత్వం వర్క్‌షీట్‌లను అందచేసిందని, వర్క్ షీట్‌లోని అభ్యాసాలు తెలుగు, ఇంగ్లీష్, గణితంలో ప్రాక్టీస్ చేయిస్తామని, వర్క్‌షీట్‌లను ఉపయోగించే తీరుపై పోషకులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు నిత్యం రాగి జావ అందచేస్తున్నట్లు గుర్తు చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా పోషకులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ నర్సింలు, ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, గోపాల్, ప్రీతి, పిటిఎస్ యాదయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్


పోలీసుల అదుపులో రేషన్ బియ్యంను తరలిస్తున్న వ్యక్తి

**కంది, ఆగస్టు 19, ప్రభాతవార్త:** పేదలకు పంపిణి చేసిన రేషన్ బియ్యంను కొనుగోలు చేసుకుని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన శనివారం మండల పరిధిలోని చేర్యాల చౌరస్తాలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం... హైద్రాబాద్ నుంచి జోగిపేట వైపు వెళుతున్న రాజస్థాన్ లారీని పోలీసులు అనుమానంతో తనిఖీ చేయడం లారీలో రేషన్ బియ్యం కానవచ్చిందన్నారు. రేషన్ బియ్యంను తరలిస్తున్న లారీని ఇంద్రకరణ్ పోలీసు ఠాణాకు తరలించి విషయాన్ని తహసీల్దార్‌కు సమాచారం అందించారు. అక్రమంగా రేషన్ బియ్యంను తరలిస్తున్న హర్యానాకు చెందిన లారీ డ్రైవర్ మోబిన్ (25), క్లీనర్ సాజీద్ (22)లను అదుపులోకి తీసుకుని వారి నుండి మోబైల్‌ఫోన్‌లను 4వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు రివార్డుల కొరకు సిపార్సు చేసినట్లు తెలిసింది.

## ప్రజాస్వామ్యంలో ప్రతీ ఓటు కీలకం

### -హుస్నాబాద్ ఆర్‌డివో బెన్‌షాలోమ్


ఓటుహక్కు అవగాహనపై ఫైవ్‌కెరన్ దృశ్యం

**హుస్నాబాద్, ఆగస్టు19, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్యంలో ప్రతీ ఓటు కీలకమని హుస్నాబాద్ రెవెన్యూడివిజనల్ అధికారి బెన్‌షాలోమ్ అన్నారు. శనివారం ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పట్టణంలో ఫైవ్‌కెరన్ నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల విషయంలో ఓటు వేయకుండా వృధా చేయవద్దని చెబుతూ ఓటు వేయకుండా మన సమస్యలపై ప్రశ్నించే అవకాశం ఉండదని అన్నారు. ఈ కార ్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్‌చైర్మన్ ఆకుల రజితవెంకన్న, సిఐ ఎర్రల కిరణ్, నోడల్ అధికారి సురేఖ, ఎన్నికల డిటి అశోక్, హుస్నాబాద్ డిటి సతీష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కారయక్రమంలో భాగస్వాములు అయిన పట్టణ వాసులకు ప్రజాప్రతినిధులకు అధికారులకు రెవెన్యూ డివిజనల్ అధికారి బెన్‌షాలోమ్ కృతజ్ఞతలు తెలిపారు.

### మైండ్‌వార్స్ జాతీయ స్పెల్‌బీ కాంపిటీషన్‌కు సిద్దం కండి

విద్యార్థుల తమ అసమాన ప్రతిభనుఈ ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇదొక అద్భుతమైన అవకాశమని భారతదేశంలో ప్రాథమిక స్థాయిలో ఉన్న విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మైండ్ వార్స్ యొక్క స్పెల్‌బీ కాంపిటీషన్ సిద్ధంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని జీఎంటర్ టైన్‌మెంట్ ఎంట ర్‌ప్రైజెస్ లిమిటెడ్ ద్వారా నిర్వహిస్తున్నారు. భారతదేశం అంతటా 4వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నారు. ఈ కాంపిటిషన్ ఇంగ్లీషులో ఉంటుంది. ఆసక్తి గల పాఠశాలలు మరింత సమాచా రం మరియు నమోదు ప్రక్రియల కోసం09625933434 సం ప్రదించాలి.


పుల్కల్‌లో 5కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

## ఉమ్మడి పుల్కల్ మండలంలో విద్యార్థుల 5కే రన్

**పుల్కల్/చౌటకూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆదేశాల మేరకు మండల కేంద్రాలైన పుల్కల్, చౌటకూరు గ్రామాల్లో శనివారం విద్యార్థులు 5కే రన్ నిర్వహించారు. మండల కేంద్రమైన పుల్కల్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి నిర్వహించిన 5 కే రన్‌ను మండల పరిషత్ పర్యవేక్షకులు తొట్ల శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు శ్రీనివాసచారిలు ప్రారంబించారు. మండల కేంద్రమైన చౌటకూరులో పంచాయితీ కార్యాలయం నుంచి అల్మాయిపేట వరకు నిర్వహించిన విద్యార్థులు 5కే రన్‌ను పంచాయితీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్‌లు ప్రారంబించారు. ఆయా కార్యక్రమాల్లో పుల్కల్ పంచాయితీ కార్యదర్శి ధనలక్ష్మి, కస్తూర్భా గాంధీ బాలికల పాఠశాల అధికారిణి, సింగూర్ గురుకుల పాఠశాల పిఈటి, చౌటకూరు పంచాయితీ కార్యదర్శి సందీప్ గౌడ్, గ్రామ సర్పంచ్ వీరమణి మొగులయ్య, యువకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### న్యాల్‌కల్‌లో అధికారుల 5కే రన్

**న్యాల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ ఆదేశాల మేరకు అధికారులు 5కే రన్‌ను నిర్వహించారు. గ్రామంలోని రెవిన్యూ, మండల పరిషత్ కార్యాలయాల నుంచి అధికారులు రన్‌లో పాల్గొన్నారు. ఓటరు నమోదుపై ఇంచార్జి తహసీల్దార్ రాజిరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంచార్జి తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి, ఎంపిఓ బి సురేష్, ఏఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాధ్యులు, రెవిన్యూ, ఎంపిపి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ సాయినగర్ కాలనీలో సిసి రోడ్డుకు శ్రీకారం


కాలనీలో సిసి రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న కార్పోరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్ కాలనీలో శనివారం 35 లక్షలతో నిర్మించే సిసి రోడ్డు నిర్మాణ పనులకు కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ యాదవ్ భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ యాదవ్ మాట్లాడుతూ డివిజన్‌లోని ఆయా కాలనీల్లో దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ సందర్బంగా కాలనీలో కార్పోరేటర్ పర్యటించి ప్రజలతో పలు విషయాలపై ఆరా తీశారు. కాలనీలోని సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామి చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు, కాలనీ వాసులు శంకర్ యాదవ్, మహేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, వీర్‌శెట్టి, కుమ్మరి సత్యనారాయణ, ప్రకాష్, సిఎం మల్లేష్, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రామారావు, నాగరాజు, చెన్నప్ప, గోవర్ధన్, మురళి, మనోహర్, మాధవి, సాధన, స్రవంతి, చంపావతి తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో కాంగ్రెస్ రాజ్యం తీసుకువస్తాం

### కేశ్‌నాయక్‌తండాలో పల్లెపల్లెకు ప్రవీణ్‌రెడ్డి


కేశ్‌నాయక్‌తండలో పల్లెపల్లెకు మాజీ శాసనసభ్యులు ప్రవీణ్‌రెడ్డి

**అక్కన్నపేట, ఆగస్టు19, ప్రభాతవార్త :** రానున్న సాధారణ ఎన్నికల్లో తెలంగాణ తెచ్చిపెట్టిన కాంగ్రెస్‌పార్టీ రాజ్యం ఖాయమని అలాగే హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని మాజీ శాసనసభ్యులు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శనివారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం కేశ్‌నా యక్‌తండ గ్రామంలో పల్లెపల్లెకు ప్రవీణన్న గడపగడపకు కాంగ్రెస్ నినాదంతో పర్యటించారు. ప్రవీణ్‌రెడ్డి రాకకు ప్రజలు నీరాజనం పడుతూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతురా జ్యమైన తెలంగాణ ప్రాంతంలో రైతన్నలకు ఊరటినచ్చేవిధంగాఆ ఒకేదఫాలో రెండులక్షల రూపాయల రుణమాఫీని కాంగ్రెస్ పార్టీ ఇస్తుందని ప్రవీణ్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో పాటు ఫించన్ల విషయానికొస్తే 4వేల రూపాయలను ఇవ్వడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటలకు అనుగుణంగానే వ్యవ హరిస్తూ మాటతప్పదని భరోసా ఇచ్చారు. అలాగే నిరుద్యోగభృతిని సైతం అందచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆకర్షితులైన యువత భూక్య మోహన్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు జంగపల్లి అయిలయ్య, సింగిల్‌విం డోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, వైస్‌చైర్మన్ భూపతి ముకుందరెడ్డి, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, మాజీ ఎంపిటిసి మ్యాక రమేష్, మాజీసర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, చింతల మల్లారెడ్డి, భూక్యమోహన్‌కుమార్‌నాయక్, లావుడ్యా రవినాయక్, గుగులోతు తిరుపతినాయక్, భూక్య సుమన్ నాయక్, మహేష్‌నాయక్, భాస్కర్ నాయక్, శేఖర్‌నాయక్, మదన్‌నాయక్, ప్రేమ్‌నాయక్, మహేందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రికి వినతి

**టేక్మాల్, ఆగస్టు,19 ప్రభాతవార్త:** అర్హులైన జర్నలిస్టులదరికి అందోల్ నియోజక వర్గ కేంద్రంలో ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని అల్లాదుర్గం, టేక్మాల్ రేగోడ్ మండలాల జర్నలిస్టులు రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావుకు వినతి పత్రం అందజేశారు. శనివారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టు వృత్తి నుండి ఎమ్మెల్యే స్థానంలో అందోల్‌కు వచ్చిన క్రాంతికిరణ్‌కు మా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని పలుమార్లు ఆయన దృష్టికి తీసుక వెళ్లిన పట్టించుకోక పోవడంతో మీ దృష్టికి తీసుకొస్తున్నామన్నారు. ఎంతో ఓపికతో ఎదురు చూశామని అయిన ఆయన మాకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం లేదని మంత్రి ముందు ఆవేధన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా మెదక్, నారాయణఖేడ్, జహీరాబాద్. నర్సాపూర్‌లలో ఇచ్చిన విధంగా అర్హులైన వారందరికి నియోజక వర్గ కేంద్రంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌తో మాట్లాడి మంజూరు అయ్యేలా చూస్తామని హామి ఇచ్చారు. ఇందులో టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం


తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు వెంకటరాజు

**కొల్చారం, ఆగస్టు19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి 24 మంది పేరెంట్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరాజు మాట్లాడుతు ఇంటింటి చదువుల పంట, లర్నింగ్ కార్నర్ గురించి పేరెంట్స్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రాజేశ్వర్ సింగ్‌ను కలిసిన వాల్దాస్ మల్లేష్‌గౌడ్, బిజెపి ఓబిసి మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షులు పాపాగారి రమేశ్‌గౌడ్

## లక్నో ఎమ్మెల్యేను కలిసిన బిజెపి నాయకులు

**నర్సాపూర్, అగస్టు 19.ప్రభాతవార్త:** నర్సాపూర్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న వారం రోజుల ప్రణాళికలో బాగంగా ప్రవాస్ గా నియామకమైన లోక్నో ఎమ్మెల్యే రాజేశ్వర్ సింగ్ ను శనివారం నర్సాపూర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్, బిజెపి ఓబిసి మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షులు పాపాగారి రమేశ్‌గౌడ్ లు సికింద్రాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. నర్సాపూర్ నియోజకవర్గంలో జరుగనున్న బిజెపి వారం రోజుల ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొనేందుకు నర్సాపూర్‌నకు రావాలని లక్నో ఎమ్మెల్యే రాజేశ్వర్‌సింగ్ ను నర్సాపూర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్, బిజెపి ఓబిసి మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షులు పాపాగారి రమేశ్‌గౌడ్ లు ఆహ్వానించారు.

## జలహనుమాన్ ఆలయంలో పూజలు, అన్నదానం


జలహనుమాన్ ఆలయంలో నిర్వహిస్తున్న పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**నర్సాపూర్, నర్సాపూర్ రూరల్, ఆగస్టు 19.ప్రభాతవార్త:** నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని పెద్దచింతకుంట గ్రామ శివారులో వెలిసిన జలహనుమాన్ ఆలయంలోనిజ శ్రావణమాసం 1వ శనివారం పురస్కరించు కొనిశ్రీజలాంజనేయస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను. సత్యనారాయణ వ్రతాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు భక్తి శ్రద్దలతో నియమ నిష్టలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను భక్తులు చేత ఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ, రాజు పంతుళ్ళ అధ్వర్యంలో వేద మంత్రాల మధ్యన జలాంజనేయస్వామికి జలాబిషేకం, పంచామృతాబిషేకం, చందన లేపనం, వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఈమేరకు మధ్యాహ్నం అన్నదాతలు భక్తుల అధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నదానాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలోఆలయ పూజారి రాధాకృష్ణాశర్మ, శివ,రాజు పంతుళ్ళు, హనుమాన్ దీక్షా గురుస్వామి పత్రాల యాదాగౌడ్ గురుస్వామి, గ్రామ సర్పంచ్ గుండెశివకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ వడ్ల సుధాకర్‌చారి, గ్రామ పెద్దలు బిక్షపతి గౌడ్, పత్రాల ప్రభుగౌడ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ మాల మహానాడు యువజన విభాగం ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్



జాతీయ మాల మహానాడు యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్‌కు నియాకపు పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ్

**నర్సాపూర్, ఆగస్టు 19.ప్రభాతవార్త:** జాతీయ మాల మహానాడు యువజన విభాగం మెదక్ జిల్లా ఉపాధ్యక్షులుగా కౌడిపల్లి మండలం తునికి గ్రామానికి చెందిన తలారి శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ్ చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందజేయడం జరిగింది ఈసందర్భంగా జాతీయ మాల మహానాడుజిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు శ్రీకాంత్ మాట్లాడుతూ దళితుల పట్ల జరుగుతున్న అన్యాయాలను అరికట్టెందకు కృషి చేస్తానని అన్నారు. దళిత జాతి బిడ్డల కోసం నిరంతరం పని చేస్తానని ఆయన తెలిపారు. ఈసందర్భంగా తనకు ఈ పదవిని కట్టబెట్టి నందులకు ఇల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ్ కు నాయకులకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలోజాతీయ మాల మహానాడు మెదక్ జిల్లా యువజన అధ్యక్షులు దాడిగా నరేశ్, కౌడిపల్లి మండల అధ్యక్షులు శివ్వయ్య, నర్సాపూర్ మండల అధ్యక్షులు గోవుయాదగిరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు

**నర్సాపూర్, అగస్టు 19.ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని అల్లూరి సీతారామ రాజు గిరిజన గురుకులపాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్‌లు జరుగుతున్నట్లు ఈ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బిక్షమయ్య, వైస్ ప్రిన్సిపాల్ కల్యాణి ఒక ప్రకటలో తెలిపారు. గురుకుల కళాశాలలోఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరె అభ్యర్థులుఈ కళాశాలలో స్పాట్అడ్మిషన్‌లు జరుగుతున్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులుఅడ్మిషన్‌లు పొందగలరని అన్నారు. ఈ అడ్మిషన్‌లు ఈ నెల 31 వరకు కొనసాగుతాయన్నారు. ఈ మేరకు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

## 23న సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

**వెల్దుర్తి, ఆగస్టు19 ప్రభాతవార్త:** ఈ నెల 23న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్‌కు వస్తున్నారని, అక్కడ జరిగే బహిరంగ సభకు మండలం నుండి 6 వేల మందిని తరలించాలని బీఆర్ఎస్ నాయలకు మండల పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్‌గౌడ్‌లు సూచించారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జన సమీకరణ సమావేవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్‌లో జరిగే సీఎం బహిరంగ సభకు బీఆర్ఎస్ నాయకులందరూ కలిసికట్టుగా ఉండి భారీ జనాన్ని తరలించాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు 23న జరిగే సీఎం బహిరంగ సభకు వారి వారి గ్రామాల నుండి భారీగా జనాన్ని తరలించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల్లోకి వెళ్లి భారీ జన సమీకరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మోహన్‌రెడ్డి, బాబు బీఆర్ఎస్ నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింలు, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆంజనేయులు, విష్ణు, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, గంగాధర్, వెంకటేషం, ఖాజా మైనోద్దీన్, పాండు, శేఖర్, యాదగిరి, ముక్తాబాయి, సుధాకర్‌రెడ్డి, రమేష్ చందర్‌లతో పాటు ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


జన సమీకరణ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ముత్తిరెడ్డి వర్గీయులు

## పల్లా గోబ్యాక్.. ముత్తిరెడ్డి వర్గీయుల బైక్ ర్యాలీ

**చేర్యాల, ఆగస్టు 19, ప్రభాతవార్త :** పల్లా రాజేశ్వర్‌రెడ్డి వద్దు ముత్తిరెడ్డె ముద్దు అంటూ ముత్తిరెడ్డి వర్గీయులు చేర్యాల పట్టణంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఈ ప్రాంతంలో అభివృద్ధి జరగదని ముత్తిరెడ్డి వర్గీయులు ఆరోపించారు. ఇక్కడి ప్రజలకు తనేవరనేది కూడా తెలియదని అంతే కాకుండా పల్లాకు టికెట్ ఇస్తే కాంగ్రెస్‌కే కలిసొస్తుందని తెలిపారు. అనంతరం ఇక్కడి నుండి తరలివెళ్ళి జనగామ పట్టణంలో పల్లాకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేర్యాల ఎంపిపి ఉల్లంపల్లి కర్ణాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మరాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ మంగోలు చంటి, అనంతుల మల్లేశం, వీరన్నపేట సర్పంచ్ కొండపాక బిక్షపతి, ఏఎంసి డైరెక్టర్ తాటికొండ సదానందం, బీఆర్ఎస్ నాయకులు పచ్చిమడ్ల సిద్దిరాములు, అరిగే కనకయ్య, పాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఫోటోగ్రాఫర్లు

**చేర్యాల, ఆగస్టు 19, ప్రభాతవార్త :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా చేర్యాల పట్టణంలోని ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు కెమెరా సృష్టికర్త అయిన శ్రీలూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షులు గుడాల రాజు, ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల పవన్ మాట్లాడుతూ ఫోటో గ్రాఫర్లకు జీవనవృత్తి కల్పించిన శ్రీలూయిస్ డాగురె సేవలు మరువలేనివని దీంతో తమ కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో గౌరవఅధ్యక్షులు కూరపాటి మధు, కద్దూరి మహేందర్, రాజగిరి గోవర్ధన్, కమిటి అధ్యక్షులు గుడాల రాజు, ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల పవన్, కోశాధికారి కోయినేని శ్రీనివాస్, ఉపాధ్యాక్షులు కొంపెల్లి శ్రీనివాస్, సహాయ కార ్యదర్శి మేడబో యిన రాజు, సహాయకోశాధికారి గుడ్లరవి, కార్యవర్గ సభ్యులు నర్సింగరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం అయిలయ

**చేర్యాల, ఆగస్టు 19, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల ప్రదానోపాధ్యాయులు దండే అయిలయ్య తెలిపారు. శనివారం ఆకునూరు గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయులు సందిటి సులోచన అధ్యక్షతన జరగగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దండే అయిలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా బోధన జరుగుతుందని, అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, పేద విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేస్తూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మెడిచెల్మి ఆయోధ్య, తాటికొండ యాదయ్య, అక్కపల్లి ఇంద్రసేనా రెడ్డి, గొంటి బుచ్చయ్య, ఉప్పల భాస్కర్, కామిడి రత్నమాల, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, ఉడుత పర్శరాములు, సూర రాజు, కోడూరి శ్రీనివాస్ విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## శ్రీఆంజనేయస్వామికి చందనాలంకరణ


ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

**కౌడిపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మొదటి శ్రామణ శనివారంను పురస్కరించుకుని మండల పరిధిలోని కన్నారంగ్రామంలో హనుమాన్ ఆలయంలో శ్రీ ఆంజనేయ స్వామికి గ్రామస్థుల ఆధ్వర్యంలో చందనాలంకరణ చేశారు. పురోహితులు రాజేశ్వర్‌శర్మ పూజలు నిర్వహించారు. భక్తులకు అల్పాహారం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డికి చెందిన రాములు గ్రామ పెద్దలు కోమటి యాదగిరి, శంకరయ్య, ఆంజేయులు, నరసాగౌడ్, సత్యాగౌడ్, బెస్త గణేష్, సత్తయ్య, సురేష్, శ్రీకాంత్, తలారి సాయిలు, ఆంజయ్య గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## సంగారెడ్డికి తరలివెళ్లిన రేషన్ డీలర్లు

**నాగల్‌గిద్ద, ఆగస్టు 19, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో శనివారం నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల రేషన్ డీలర్లు రేషన్ డీలర్‌ల సంఘం అధ్యక్షులు గడ్డె సంగ్‌శెట్టి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో రేషన్ డీలర్లు సంగారెడ్డికి తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు దృష్టికి తీసుకుపోయినట్లు సంఘం మండల అధ్యక్షులు సంగ్‌శెట్టి పేర్కొన్నారు.

## గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు సంప్రదించవచ్చు : ప్రిన్సిపాల్

**కొల్చారం, ఆగస్టు19 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కొల్చారంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ మొదటి సంవత్సరం ప్రవేశం కొరకు ఖాళీగా ఉన్న ఎస్సీ 01, ఓసీ 01, మైనార్టీ 01 సీట్లకు గాను ఆసక్తి గల విద్యార్థులు పాఠశాలకు ఈ నెల 21వ తేదీన వచ్చి సంప్రదించాలని ప్రిన్సిపాల్ జయలక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**మెదక్ రూరల్, ఆగస్టు19 ప్రభాతవార్త:** వ్యవసాయానికి తెచ్చిన అప్పుల బాధతో ఒక రైతు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పేరూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పేరూర్ గ్రామానికి చెందిన చింతకింది దుర్గయ్యకు వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయానికి సంబంధించిన పనులకు గాను ట్రాక్టర్ తీసుకున్నాడు. వ్యవసాయంలో అంతగా లాభం రాకపోవంతో ట్రాక్టర్‌ను విక్రయించాడు. కానీ అప్పులు తీరలేదు. అప్పుల వారి బెడద ఎక్కువ కావడంతో మనస్తాపం చెందిన దుర్గ్య ఇంట్లో అందరు నిద్రిస్తుండగా శనివారం తెల్లవారు జామున ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసు కున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పేదల కోసం దేశంలో ఎక్కడ లేని విధంగా సిఎం కెసిఆర్ : ఎమ్మెల్యే రసమయి



కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

**బెజ్జంకి, అగస్టు 19, ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్ ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన కళ్యాణ లక్ష్మీ పథకం నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపు తుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ పథకం లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పని చేస్తుందన్నారు. సిఎం కెసిఆర్ ప్రధాన లక్ష్యం అభివృద్ధి, సంక్షేమం అన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమానికి దేశంలో ఎక్కడ లేని విధంగా అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నారని తెలి పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు లింగాల నిర్మల, కనగండ్ల కవిత, కచ్చు చం ద్రకళ, పాకాల మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, తిరుపతి,శ్రీనివాస్‌గుప్తా, రాజయ్య, తిరుపతిరెడ్డి, మల్లేశం, శేఖర్‌బాబు, శ్రీనివాస్, మోహన్, దీటి రాజు తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన : ఎమ్మెల్యే**

మండల పరిధిలోని గుండారం, బెజ్జంకి క్రాసింగ్, ముత్తన్నపేట గ్రామా లకు చెందిన పలువురు అనారోగ్యంతో మృతి చెందగా శనివారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. అయన వెంటన సర్పంచ్ కనగండ్ల రాజేశం, నాయకులు దుంబాల మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేస్తున్నాం : దరిపల్లి చంద్రం



గాంధీభవన్‌లో టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు చంద్రం

**సిద్దిపేట రూరల్, అగస్టు 19, ప్రభాతవార్త :** రాబోయే అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచే వారు పార్టీ టికెట్ కోసం హైదారాబాద్‌లోని గాంధీ భవన్‌లో దరఖాస్తు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని టిపిసిసి అదేశాల మేరకు సిద్దిపేట నియోజకవర్గం నుంచి బరిలోకి దిగడానికి టిపిసిసి సభ్యులు, సీనియర్ నాయకులు దరిపల్లి చంద్రం శనివారం తన అనుచరులతో కలిసి దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడుతూ టిపిసిసి అదేశాల మేరకు పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రాస్తారోకోలు, దిష్టిబొమ్మల దహనం చేయడం జరుగుతుం దన్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు ఎల్లా వేళాల అందుబా టులో ఉంటూ పార్టీని బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), నంగునూర్, చిన్నకోడూరు మండల పార్టీ అధ్యక్షులు తప్పెట శంకర్, మిట్టపల్లి గణేష్, నాయకులు బిక్షపతి, బర్మా రామచంద్రం, రాములు, ఖయాజుద్దీన్, అనిల్, నవీన్, మధు, అశోక్, రాగుల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూడవెల్లి గ్రామ నూతన కమిటీ నియామకం

**మిరుదొడ్డి, అగస్టు 19, ప్రభాతవార్త:** అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెల్లి గ్రామ నూతన కాంగ్రెస్ కమిటీని శనివారం నియమించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కపల్లి బాల్‌నర్సాగౌడ్, ఉపాధ్యక్షులు గజభీంకర్ అశోక్‌ల అధ్వర్యంలో నూతన కమిటీని నియ మించి నియామకం పత్రాలను అందజేశారు. కూడవెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎనగంటి చంద్రం, ఉపాధ్యక్షులుగా సాదుల చంద్రం, ప్రధాన కార్యదర్శిగా ఎనగంటి యాదగిరిలను ఎన్నుకున్నారు. నూతన గ్రామ కమిటీ పార్టీని మరింత బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో దుబ్బాకలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందన్నారు. పార్టీ నాయకులు కనపూరం బాలు,శేరుపల్లి తరుణ్, అన్నబోయిన చందు, ఉద్దమారి సతీష్, వెంకటస్వామిగౌడ్, ఎనగంటి రాజు, బండి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్లు తీసిన ఫోటోలతో ఎన్నో మధుర జ్ఞాపకాలు దాగి ఉంటాయి

**సిద్దిపేట రూరల్, అగస్టు 19, ప్రభాతవార్త :** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని సిద్దిపేటలో వివిధ పత్రికల్లో పని చేస్తున్న ఫోటో జర్నలిస్టులను టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)లు ఘనం గా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి పగలు అనే తేడా లేకుండా తమ వృత్తినే దైవంగా భావిస్తూ ఫోటోగ్రాఫర్లు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఫోటోగ్రాఫర్లు తీసిన ఫోటోలతో ఎన్నో మధుర జ్ఞాపకాలు దాగి ఉంటాయన్నారు. పార్టీ నాయకులు బిక్షపతి, మధు, అనిల్, కనకయ్య, రఘుపతి, నవీన్, యాదగిరి తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**మిరుదొడ్డి, అగస్టు 19, ప్రభాతవార్త :** మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన మొహమ్మద్ జారిన బేగం భర్త బాబా గత కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మరణించడంతో ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి అదేశాల మేరకు బాధిత కుటుంబానికి బిఅర్ఎస్ నాయకులు శనివారం అర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జడ్‌పి కో-అప్షన్ సభ్యులు రహీమొద్దీన్, తొగుట మండల కో-అప్షన్ సభ్యులు కలిముద్దీన్, మిరుదొడ్డి, దుబ్బాక, రాయపోల్, దౌల్తాబాద్ మండల పరిషత్ కో-అప్షన్ సభ్యులు ఇస్మాయిల్,ఫర్వేజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూరులో ఘనంగా బల సంరక్షణ

**చౌటకూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులో శనివారం అంగన్‌వాడి టీచర్ల, ఆశ వర్కర్‌ల ఆధ్వర్యంలో బాల సంరక్షణ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో విధులు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామంలోని చిన్నారులకు సంరక్షణ గురించి తల్లులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ నర్సిం హారెడ్డి, ఉప సర్పంచ్ ముకుందం, వార్డు సభ్యులు మోహన్‌అంగన్‌వాడి టీచర్లు మరియా, దుర్గాబాయి, రూపావతి, అన్నపూర్ణ, మొగులమ్మ, సత్యనీల దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

## గో బ్యాక్ గో బ్యాక్ పల్లా గో బ్యాక్

### ముత్తిరెడ్డి వర్గీయుల రాస్తారోకో పల్లా దిష్టిబొమ్మ దహనం

**కొమురవెల్లి, అగస్టు 19, ప్రభాతవార్త :** పల్లా వద్దు ముత్తిరెడ్డి ముద్దు అనే నినాదాలతో కొమురవెల్లి మండల బిఅర్ఎస్ నాయకులు శనివారం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బిఅర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు గీస బిక్షపతి మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి గత పది యేండ్లుగా కృషి చేస్తున్న ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికే టికెట్ కేటాయించాలన్నారు. ఎనాడు జనగామ నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని పల్లా రాజేశ్వర్‌రెడ్డికి జనగామను అభివృద్ధి చేస్తానని వ్యాఖ్యాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. డబ్బుల సంచులతో స్థానిక ప్రజాప్రతినిధులను కొనుగోలు చేసే వ్యక్తి నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. అధిష్టానం అలోచించి ముత్తిరెడ్డికే మరో అవకాశం కల్పిస్తే 50 వేల మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కాగిత రాజేం దర్‌రెడ్డి, సర్పంచ్ బీమనపల్లి కరుణాకర్‌రెడ్డి, నాయకులు తలారి కిషన్, స్వాములపల్లి కనకచారి, రమేష్, పోతుగంటి కొమురవెల్లి, జోగు నాగరాజు, మెరుగు కృష్ణ తదితరులు ఉన్నారు.

## సిద్దిపేటలో పర్యటించిన రీజనల్ డైరెక్టర్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

**సిద్దిపేట రూరల్, అగస్టు 19, ప్రభాతవార్త:** వరంగల్ రీజనల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ అలీ, రీజనల్ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాస్‌లు శనివారం సిద్దిపేట పట్టణంలో పర్యటించారు. రంగనాయక సాగర్ వద్ద గల నర్సరీలో మొక్కలను పరిశీలించారు. నర్సరీ నిర్వహణ ఎంతో బాగుం దన్నారు. అనంతరం రంగనాయకసాగర్‌ను పరిశీలించారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ బయో మైనింగ్, బయో సిఎన్‌జీ గ్యాస్ ప్లాంటు, కార్బన్ మాస్టర్స్ తయారు చేస్తున్న సేంద్రియ వురువు తయారీ విధానాన్ని, బయో మైనింగ్‌ను పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎఈ పంతం మహేష్ తదితరులు ఉన్నారు. కాగా మంత్రి హరీష్‌రావు హ్యాట్సాఫ్ తెలిపి రంగనాయకసాగర్ వ్యూ షారిన్‌లో ఉన్నట్లుగా ఉందన్నారు. అలాగే నర్సరీ నిర్వహణ భేష్‌గా ఉందని పేర్కొన్నారు.

## బిజెపి తీర్థం పుచ్చుకున్న రియల్ వ్యాపారి

**కోహెడ, అగస్టు 19, ప్రభాతవార్త :** కోహెడ మండల కేంద్రానికి చెందిన రియల్ వ్యాపారి పెర్యాల సాగర్‌రావు శనివా రం కరీంనగర్ ఎంపి, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అధ్వర్యంలో అ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పెర్యాల సాగర్‌రా వుకు బండి సంజయ్ కాషాయపు కండువ కప్పి పార్టీలోకి అహ్వానించారు. అనం తరం అయన మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరిని పార్టీ అధిష్టానం గుర్తిసుందన్నారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు ఖమ్మంపల్లి వెంకటేశం, నాయకులు శ్రీనివాస్, నర్సయ్యగౌడ్, రమేష్, జగన్ యాదవ్, రాంచంద్రారెడ్డి, శివకుమార్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, శేఖర్, రాజు, శ్రీకాంత్, సుమన్ యాదవ్, కుమారస్వామి, శివసాయిగౌడ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నా

**తొగుట, అగస్టు 19, ప్రభాతవార్త:** తొగుట మండలాన్ని అభివృద్ధిలో ముందంజలో ఉంచడానికి ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా సహకరించాలని ఎంపిపి గాంధారి లతనరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అమె పాల్గొని మాట్లాడారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధియే తన లక్ష్యమన్నారు. ఎల్లారెడ్డిపేట సర్పంచ్ గోవర్ధన్ మాట్లాడుతూ సిద్దిపేట నుంచి జెబిఎస్ ఉదయం, సాయంత్రం బస్సులు నడపాలని కోరారు. శ్రీనిధి నిధులలో అవినీతి జరుగుతుందని అధికా రులు చర్యలు తీసుకోవాలని తుక్కాపూర్ సర్పంచ్ చంద్రం కోరారు. ఎపిఓ సరిగా విధులు నిర్వహించడం లేదని బదిలీ చేయాలన్నారు. సమావేశంలో ఎంఎంసి చైర్మన్ కొమురయ్య, ఎంపిడిఓ శ్రీధర్, వైస్ ఎంపిపి శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈవో యాదవరెడ్డి, సర్పంచ్ బొడ్డు నర్సింహులు, కొండల్‌రెడ్డి, మంగ రేణుక, నర్సింలు, ప్రేమలతచంద్రరెడ్డి, ఎంపిటిసి స్వామి,కో-అప్షన్ సభ్యులు ఎం.డి. ఖలీమొద్దీన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మను దర్శించుకున్న దేవాదాయ అధికారులు

**పాపన్నపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాతను శనివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న దేవాదయ ధర్మాదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ సీతారాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున్‌లను ఆలయ ఇఓ సార శ్రీనివాస్ ఘనంగా స్వాగతం పలుకగా ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా అధికారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధికా రులను ఆలయ ఇఓ సార శ్రీనివాస్ శాలువాతో సత్కరించగా అర్చకులు తీర్థ ప్రసా దాలు అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చేపడుతున్న దుకాణ సముదాయాల నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షించి నిర్మాణ పనులు నాణ్యవంతంగా నిర్మించేలా చూడాలని బాధ్యులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీర్ హోమ్ ప్రకాష్, డిజైనింగ్ ఇంజనీర్ దుర్గా ప్రసాద్, ఏఈ రమేష్, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ శర్మ, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

**రామాయంపేట,ఆగస్టు 19, ప్రభాతవార్త:** శనివారం నాడు రామాయంపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో నిజాంపేట మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన సుమారు 20 మంది యువకులు పీసీసీ సభ్యులు సుప్రభాత్‌రావు,పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలక్రిష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి కాంగ్రెస్ పార్టీ ఖండువా కప్పి పార్టీలోని ఆహ్వానించి వచ్చే వంద రోజులు కష్టపడి చేయాలని మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని యువకులను కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, రామాయంపేట పట్టణ మాజీ అధ్యక్షులు డాకి స్వామి, కాంగ్రెస్ పార్టీ రామాయం పేట పట్టణ వైస్ ప్రెసిడెంట్ అల్లాడి వెంకటేష్, రామా యంపేట పట్టణ కో ఆర్డినేటర్ డాకి నాగేందర్,నార్లాపూర్ గ్రామానికి చెందిన సాయి కుమార్‌రెడ్డి, రాకేష్ యాదవ్,కరుణాకర్, రోహిత్,నిఖిల్, రాజేష్ భూపాల్, రోషన్,హరీష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టించుకోవడం లేదు.. పార్టీని వీడుతున్నా : నవీన్‌కుమార్

**జహీరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** గత 9 సంవత్సరాలుగా పార్టీకి అంకిత భావంతో సేవలు అందించి పార్టీ పురోభివృద్ధికి సేవలు అందించిన తనకు పార్టీ పెద్దలు పట్టించకోకపోవడంతోనే బిఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు బిఆర్ఎస్ సీని యర్ నాయకులు అనంత నవీన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో తన ను కలిసిన విలేఖరులతో అనంత నవీన్‌కుమార్ మాట్లాడుతూ 2014, 2018 శాసన సభ, పార్లమెంట్ ఎన్నికల్లో, సర్పంచ్, మండల పరిషత్ ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు తీవ్రంగా కృషి చేసినట్లు గుర్తు చేశారు.



రెండో ఎఎన్ఎంలు చేపట్టిన సమ్మెకు సంఘీభావం ప్రకటించి మాట్లాడుడుతున్న కాంగ్రెస్ నాయకులు సొప్పదండి చంద్రశేఖర్

## రెండో ఎఎన్ఎంల సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రెండో ఎఎన్ఎంలు తమను క్రమబద్ధీకరణ చేయాలని గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుల సొప్పదండి చంద్రశేఖర్ ప్రభుత్వంపై మండిపడ్డారు. తమను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ రెండో ఎఎన్ఎంలు జిల్లా కేంద్రంలోని హైదారాబాద్ రోడ్డు ఎంపిడిఓ కార్యాలయం అవరణలో చేపట్టిన సమ్మె శనివారం 4వ రోజుకూ చేరుకుంది. ఈ సందర్భంగా అయన ఎఎన్ఎంల సమ్మెకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. గ్రామీణ ప్రాం తాలలో రకరకాల వ్యాధులు ప్రభలుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రెండో ఎఎన్ఎంల సమ్మె ఇలాగే కొనసాగితే గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు మరింత విజృంభించే అవకాశం ఉందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం రెండో ఎఎన్ఎంలో వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు. ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా వైద్య సేవలను అందించిన రెండో ఎఎన్ఎంలను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలని లేని యెడల సిద్దిపేటలోని మంత్రి హరీష్‌రావు క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి స్తామన్నారు. రెండో ఎఎన్ఎంలను క్రమబద్ధీకరణ చేసే వరకు కాంగ్రెస్ పార్టీ అండం గా ఉంటుందన్నారు. అలాగే బిఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి యాదగిరి ఎఎన్ఎంలకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, సహాయ కార్యదర్శి బెక్కంటి సంపత్, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు, ఎఎన్ఎంలు భాగ్య, చంద్రకళ, కృష్ణవేణి, రజిత, మంజుల, రూప తదితరులు పాల్గొన్నారు.

## తార కళాశాలలో ప్రపంచ మానవత దినోత్సవం



తారా కళాశాలలో ప్రపంచ మానవత దినోత్సవం జరుపుకుంటున్న దృశ్యం

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాల (ఎ)లో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఐక్యూఏసి సహకారంతో ప్రపంచ మానవతా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ ప్రజల జీవితాలను మెరుగుపర్చుటకై నిరంతరంగా కృషి చేస్తున్న మానవతా వాదులను గౌరవించుకునేందుకు ఆగస్టు 19న ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ప్రపంచ మానవత దినోత్సవం జరుపుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటేశం, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సిద్దులు, డాక్టర్ పద్మజ, శివదీప్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బిజెపి కార్యాలయంలో ఫోటో గ్రాఫర్‌ల దినోత్సవం

**రామచంద్రాపురం, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ప్రపంచ ఫోటో గ్రాఫర్‌ల దినోత్సవాన్ని శనివారం రామచంద్రాపురం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫోటో గ్రాఫర్‌లను గోదావరి అంజిరెడ్డి శాలు వాలతో సన్మానించి మెమోంటోలను అందచేశారు. ప్రతి మనిషి జీవితంలో మదుర జ్ఞాపకాలుగా మిగిలేవి ఫోటోలే అని గోదావరి అంజిరెడ్డి గుర్తు చేశారు. నియో జకవర్గంలోని ప్రతి ఫోటో గ్రాఫర్‌కు 5 లక్షల ప్రమాద భీమా సౌకర్యాన్ని ఉచితంగా అందచేస్తున్నట్లు, ఫోటో గ్రాఫర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సురేందర్, మల్లేష్, బసవమ్మ, గీత, ఫోటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షులు కృష్ణ యాదవ్, బాధ్యులు పెంటేష్, అఖిల్, ఆంజనేయులు, రియాజ్, ప్రవీణ్, వీరన్న, సతీష్, కిషన్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ సత్యనారాయణ

**సదాశివపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** కూకట్‌పల్లిలో లొంగైక్య గంధం నాగేంద్ర తనయుడు గంధం శ్రావణ కుమార్ శనివారం తన అర్ధాంగి సౌమ్యలో కలిసి వైభ వంగా జరుపుకున్న లక్ష్మి పూజలో ఎమ్మెల్సీ సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు గంధము అమరావతి, సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం ప్రధాన కార్యదర్శి అనిమిశెట్టి జయప్రకాశ్, నార్త్‌జోన్ ట్రాఫిక్ ఎసిపి మధుసూదన్‌రెడ్డి సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, బిఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ సంగీత, వీరశైవ లింగాయత్ రాష్ట్ర నాయకులు అడికే జగదీశ్వర్, కోట గుం డప్ప, చెల్మెడ బస్వరాజ్, అలి బద్రన్న, విజయలింగం, పోచారం అశోక్, సుధాకర్, రాజు, రామోజి నవీన్, సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం మహిళా ప్రధాన కార్యదర్శి గొర్రెగట్టు శారత, ఉపాధ్యాక్షురాలు కరుణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల సాఫ్ట్ బాల్ అకాడమీ విద్యార్థి అంతర్జాతీయ పోటీకి ఎంపిక

**నర్సాపూర్, అగస్టు 19.ప్రభాతవార్త:** నర్సాపూర్ గురుకుల సాఫ్ట్ బాల్‌అకాడమీ విధ్యార్థి అంతర్జాతీయ పోటికి ఎంపికయ్యారని గరుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బిక్షమయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈగురుకులంలో చదువుతున్న విధ్యార్థులు కె.అరవింద్, జె.కృష్ణ లు బేస్ బాల్ యు/18 పురుషుల అంతర్జాతీయ బేస్బాల్ భారత జట్టు శిభిరం కి ఎంపిక అయ్యారని తెలిపారు.ఈ నెల 21 నుండిసెప్టెంబర్ 1 వరకు జరుగబోయే భారత జట్టు శిభిరంలో పాల్గొ నాలని బేస్‌బాల్ ఫెడరేషన్ అఫ్ ఇండియా సెక్రటరీ తెలిపారని చెప్పారు. అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎంపికైన విధ్యార్థులు మెక్సికోలో జరిగే వింటర్ లీగ్ బేస్‌బాల్ ఛాంపియన్ షిప్ సెప్టెంబర్ 5 నుండి అక్టోబర్ 5 వరకు 2023 లో పాల్గొంటారని తెలిపారు.ఈ విధ్యార్థులు అంతర్జాతీయ బేస్‌బాల్‌అండర్ 18 మెన్ టీమ్ లో పాల్గొనాలని ప్రిన్సిపాల్ బిక్షమయ్య, వైస్ ప్రిన్సిపాల్ చార్లెస్, కళ్యాణి, శానవాజ్, కోచ్ పిడి సుజాత, ఉపాద్యాయుల బృందం కోరారు. ఈసందర్భంగా వారు విధ్యార్తులను అభినందించారు.

## మద్యం దుకాణాలకు భారీ ఎత్తున దరఖాస్తులు

### -17 దుకాణాలకు 942 ధరఖాస్తులు

జహీరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త: జహీరాబాద్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 17 మద్యం దుకాణాలకు భారీ ఎత్తున 942 ధరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ యం అశోక్‌కుమార్ తెలిపారు. కోహీర్ మండలం కవేలికి జనరల్‌కు కేటాయించగా అత్యధికంగా 92 మంది ధరఖాస్తులు చేసుకున్నారన్నారు. కోహీర్ మండలంలో ఎస్సీలకు రిజర్వు చేసిన దుకాణానికి 70 మంది ధరఖాస్తులు చేసుకున్నారన్నారు. మొగుడంపల్లి మద్య దుకాణానికి 29ధరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ధరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి 18కోట్ల 84లక్షల రూపాయల ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో శాసన సభ, పార్లమెంట్ ఎన్నికలు రానుండటంతో మద్యం దుకాణాలకు భారీ ఎత్తున ధరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నెల 21వ తారీఖున జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లిలోని జెఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఆధ్వర్యంలో డ్రా తీయనున్నట్లు సిఐ అశోక్‌కుమార్ తెలిపారు. డ్రాలో మద్యం దుకాణాలను దక్కించుకున్న అభ్యర్థులకు దుకాణాలను అప్పగించనున్నట్లు అశోక్‌కుమార్ వివరించారు. మద్యం దుకాణాలు పొందిన అభ్యర్థులు డిసెంబరు 1వ తేదీ నుంచి దుకాణాల్లో మద్యం అమ్ముకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు వివరించారు.



రైతులకు నష్ట పరిహారం అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

## రైతన్నకు అండగా ఎమ్మెల్యే జీఎంఆర్

**అమీన్‌పూర్, ఆగస్టు19 ప్రభాతవార్త:** కలుషిత జలాలు త్రాగి పశు సంపదను కోల్పోయిన రైతులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అండగా నిలిచారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన భిక్షపతి, రాజు అనే ఇద్దరు రైతులకు సంబంధించిన 5 పాడిగేదెలు ఇటీవల గ్రామ పరిధిలోని ఆసాని కుంటలో కలుషిత జలాలు త్రాగి మృత్యువాత పడ్డాయి. స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్ ఘటనకు సంబంధించి కారకులైన సంబంధిత పరిశ్రమ యజమా నులతో చర్చించారు. ఈ మేరకు ఇద్దరు రైతులకు 2 లక్షల 50 వేల రూపాయల నష్ట పరిహారాన్ని అందించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యనరకమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు బ్యాంకు రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలి : మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఐకేపీ డీపీఎం మోహన్

**పెద్దశంకరంపేట, ఆగస్టు19 ప్రభాతవార్త:** మహిళా సంఘాల ద్వారా మహిళలు బ్యాంకులో రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలని ఐకేపీ డీపీఎం మోహన్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని స్త్రీ శక్తి భవనంలో మహిళా సమైక్య సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం రుణాలు అందజేస్తుందని, మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. తొందరలోనే మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో మగ్గం వర్క్, కుట్లు, అల్లికల శిక్షణ కేంద్రం చేపట్టడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కోఆర్డినేటర్ కవిత, ఐకేపీ ఏపీఎం గోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ, సీసీలు నిరంజన్, లక్ష్మణ్, మోహన్, సుమిత్ర, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల పనితీరుపై ఎంపీపీ ఆగ్రహం



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జంగం శ్రీనివాస్

**పెద్దశంకరంపేట, ఆగస్టు19 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేట మండల పరిధిలోని వివిధ శాఖల అధికారుల సనితీరుపై ఎంపీపీ జంగం శ్రీని వాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పెద్దశంకరంపేటలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు తమ పనితీ రును మెరుగుపరుచుకొని ప్రజలకు సేవలు అందించాలన్నారు. పని తీరు మార్చుకోకుంటే ఉన్నతాధికారులకు సమాచారం అందించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు మండలం లో సక్రమంగా పనిచేయడం లేదని, ఎలాంటి సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు ఇవ్వడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై కూడా ఎంపీపీతో పాటు పలువు రు మండల సభ్యులు మండిపడ్డారు. గ్రామాల్లో ఎస్‌డీఎఫ్, సీడీపీ పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు తొందరగా పూర్తి అయ్యేలా చూడాలని ఎంపీపీ సూచించారు. వితంతువు పెన్షన్లకు సంబంధించి రెండు రోజుల్లో ఆన్‌లైన్ చేసుకోవాలని ఎంపీడీవో రఫిక్ ఉన్నీసా సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలలో కలిసి పని చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు గ్రామంలో ప్రజ లు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా, తహాశీల్దార్ గ్రేసిబాయి, ఆర్ఐ శంకరప్ప, మండల రైతుబంధు అధ్యక్షులు సురేష్‌గౌడ్, ఎంపీటీసీలు వీణ సుభాష్‌గౌడ్, దత్తు, దామోదర్, రాజు, ఆయా గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, ఆగస్టు18 ప్రభాతవార్త:** ఇటీవల కురిసన భారీ వర్షాలకు మెదక్ పట్టణం, మెదక్ మండలం, హవేళిఘనపూర్ మండలాలకు చెందిన పలు గ్రామాల్లో 132 ఇళ్లు కూలిపోయాయి. కాగా బాధితులకు శనివారం మెదక్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చెక్కులను అందజేశారు. 132 మంది లబ్ధిదారులకు రూ.4,44,400 విలువ చేసే చెక్కులను అందజేశారు. అనంతరం నియోజకవర్గంలోని పాపన్నపేట, మెదక్, హవేళిఘనపూర్ మండలాలకు చెందిన 67 మంది లబ్ధిదారులకు రూ.21,29,500 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ లావణ్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మెదక్ ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సి లర్లు కృష్ణారెడ్డి, వసంత్‌రాజ్, ఆర్‌కె. శ్రీనివాస్, లక్ష్మీనారాయణగౌడ్, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఉమర్, నాయకులు లింగారెడ్డి, ప్రభురెడ్డి, మోచి కిషన్, స్వామి, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాలో సెక్యూరిటీ తనిఖీ

**మనూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండలంలోని పుల్‌కుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు శనివారం సేఫ్టీ, సెక్యూరిటీకై తనిఖీలు నిర్వహించారు. మనూ ర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగారం శ్రీనివాస్, ఉపాధ్యాయులు బి జ్యోతి, మఠం రాజులు కలిసి పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో అగ్ని ప్రమాదం జరిగితే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, రక్షణ చర్యలకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలన్నదానిపై పరిశీలించి అవగాహన కల్పించారు.